సాక్షి
మెదక్
శనివారం ၊ 10 ၊ మే ၊ 2025



సరదా సరదాగా..

ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదానికి సిద్దిపేట చిరునామాగా నిలుస్తోంది.

వివరాలు 10లో ▸



విజ్ఞాన కేంద్రం.. కళల నిలయం

విద్యార్థుల కోసం జహీరాబాద్ శ్రామిక్ విజ్ఞాన కేంద్రం శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది.

వివరాలు 10లో ▸



లో లెవెల్ వంతెనతో ఇబ్బందులు

లో లెవెల్ వంతెనలతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి హేమలత

నర్సాపూర్: గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ జడ్జి హేమలత సూచించారు. శుక్రవారం కోర్టులో లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో చెక్ బౌన్స్ కేసులలో ఇరువర్గాలు రాజీ కుదుర్చుకొని కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. న్యాయవాదిని నియమించుకునేందుకు ఆర్థిక స్థోమత లేని పేద వారికి ఉచితంగా లీగల్ ఎయిడ్ ద్వారా న్యాయవాదిని నియమించేందుకు లీగల్ సర్వీస్ సహకరిస్తుందని చెప్పారు.

సైన్యానికి మద్దతుగా పూజలు



వన దుర్గమ్మకు పూజలు చేస్తున్న సిబ్బంది

పాపన్నపేట(మెదక్): పాకిస్తాన్‌తో భారత సైన్యాల పోరాటానికి మద్దతుగా దేవాదాయ శాఖ ఉద్యోగులు శుక్రవారం ఏడుపాయల దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. భారత సైన్యం విజయాన్ని కాంక్షిస్తూ, తీవ్రవాద నాశనాన్ని ఆశిస్తూ అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేయాలి



రైస్‌మిల్లులో అన్‌లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం లారీలను సరైన సమయంలో అన్‌లోడ్ చేసి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గాయత్రి రైస్‌మిల్‌ను తనిఖీ చేశారు. మూడు లారీలు అన్‌లోడ్ కోసం వేచి ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అన్‌లోడ్ చేసి వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డివిజన్ కేంద్రాల్లో శిక్షణ ఏర్పాటు చేయాలి

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను డివిజన్ కేంద్రాల్లోనూ ఏర్పాటు చేయాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకరి కృష్ణ, సామ్యానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో ఇస్తున్న శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో కాకుండా డివిజనల్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలన్నారు. రవాణా సౌకర్యాలు, వేసవి తీవ్రత దృష్ట్యా రెండు, మూడు మండలాలను కలిపి ఒకే దగ్గర శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నారు. కొందరు ఉపాధ్యాయులు అత్యవసర పనుల దృష్ట్యా ఒక స్పెల్‌కు హాజరుకాలేకపోతే రెండవ స్పెల్‌కు అనుమతించాలని డీఈఓను కోరారు.

అదనపు కలెక్టర్‌కు పరామర్శ



అదనపు కలెక్టర్ మాతృమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: మాతృమూర్తిని కోల్పోయిన అదనపు కలెక్టర్ మెంచు నగేష్‌ను సూర్యాపేట జిల్లా మిర్యాల గ్రామంలో శుక్రవారం జిల్లా అధికారులు పరామర్శించారు. అనంతరం మరణించిన సత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్‌ను పరామర్శించిన వారిలో డీఆర్‌ఓ భుజంగరావు, తూప్రాన్, నర్సాపూర్ ఆర్డీఓలు జయచంద్రారెడ్డి, మహిపాల్‌రెడ్డి, డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావు, డీఈఓ రాధాకిషన్, నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

ఆంజనేయ.. ఆర్మీకి నీవే అండ..



శతఘట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చిన్నగొట్టిముక్ల అరణ్యంలో కొలువైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని దుర్గాప్రసాద్ స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉగ్రవాదాన్ని నాశనం చేసి పాక్‌కు బుద్ధి చెప్పాలనే సంకల్పంతో భారత్ నిర్వహిస్తున్న ఆపరేషన్ సిందూర్‌లో త్రివిధ దళాలు విజయవంతం కావాలని శతఘట్టాభిషేకం నిర్వహించారు. పూజలో ఆలయ ఫౌండర్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు. నర్సాపూర్ అయ్యప్ప మారుతి క్లాత్ స్టోర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. – శివ్వంపేట(నర్సాపూర్)

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: అర్హత కలిగిన అభ్యర్థులకు లైసెన్స్ సర్వేయర్ శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియెట్ (గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండాలి) కనీసం 60 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. అలాగే ఐటీఐలో డ్రాఫ్ట్‌మెన్ సివిల్, డిప్లొమా, సివిల్, బీటెక్ సివిల్ లేదా ఇతర సమానమైన అర్హత కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు తెలంగాణలోని అన్ని మీ సేవ కేంద్రాల్లో ఈనెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మొత్తం 50 పని దినాల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలానికి ఓసీ అభ్యర్థులకు రూ. 10 వేలు, బీసీ అభ్యర్థులకు రూ. 5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704443476, 9398987337 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరిస్తాం

న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి సుభవల్లీ



మెదక్‌జోన్: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చెక్‌బౌన్స్ కేసులను పరిష్కరిస్తామని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సుభవల్లీ తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ సూచనల మేరకు ఈనెల 19 వరకు ప్రత్యేకంగా చెక్‌బౌన్స్‌కు సంబంధించిన కేసులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. అలాగే జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని రాజీ పడాలని వివరించారు. చిన్నచిన్న గొడవలతో కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగి విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోవద్దని సూచించారు.

జీరో.. డౌన్!

ఎండలు మండుతున్నాయి. వడగాలులు, ఉక్కపోతతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. దీని ప్రభావం గృహజ్యోతి పథకంపై పడింది. ఫలితంగా చాలా మంది లబ్ధిదారులు పథకానికి అనర్హులుగా తేలారు. – మెదక్‌జోన్

ఎండ సురసుర.. మీటర్ గిరగిర

- తగ్గుతున్న 'గృహజ్యోతి' లబ్ధిదారులు
- జిల్లాలో పెరిగిన విద్యుత్ వినియోగం



'గృహజ్యోతి' అర్హుల సంఖ్య	1,31,950
పెరిగిన అనర్హుల సంఖ్య ఇలా..	
ఫిబ్రవరి	1,418
మార్చి	1,457
ఏప్రిల్	3,807
మే	4,557

జిల్లావ్యాప్తంగా 7 లక్షల పైచిలుకు జనాభా ఉండగా, 1,31,950 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీరంతా తెల్లరేషన్ కార్డు కలిగి ఉండటంతో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ పొందుతున్నారు. ఎండల తీవ్రతతో ఫిబ్రవరి నుంచి క్రమంగా పథకానికి లబ్ధిదారులు దూరం అవుతూ వస్తున్నారు. జిల్లాలో 1,31,950 మంది గృహజ్యోతి పథకానికి అర్హులు కాగా, ఫిబ్రవరిలో 1,418 మంది మార్చిలో 1,457, ఏప్రిల్‌లో 3,807, ఈ నెలలో 4,557 మంది అనర్హులుగా తేలారు.

వేసవి ఎండల ప్రభావంతో..

రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే జిల్లాలలో మెదక్ 4వ స్థానంలో ఉంది. కాగా ఫిబ్రవరిలో 35 డిగ్రీలు నమోదు కాగా, మార్చిలో 40 డిగ్రీలకు పెరిగింది. ఏప్రిల్, మేలో 42 నుంచి 43 డిగ్రీలకు చేరుకుంది. అంతేకాకుండా ఏప్రిల్ 24 నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లలోనే ఉంటున్నారు. ఎండల తీవ్రతకు ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు, టీవీ వినియోగం గణనీయంగా పెరిగింది. దీంతో విద్యుత్ మీటర్లు గిర్రున తిరగటంతో ఈనెలలో 4,557 మంది గృహజ్యోతి లబ్ధిదారులు 200 యూనిట్ల విద్యుత్ కన్నా ఎక్కువగా వాడటంతో అనర్హులుగా మారారు. కాగా విద్యుత్ యూనిట్ల వినియోగం పెరిగినా కొద్ది ధరలో మార్పు వస్తోంది. ఇందులో భాగంగా 1 నుంచి 50 యూనిట్ల విద్యుత్ వాడితే రూ. 1.95 పైసలు, 50 నుంచి 100 యూనిట్ల వరకు యూనిట్ ధర రూ. 3.10, అలాగే 101 నుంచి 200 యూనిట్ల వరకు రూ. 4.80 యూనిట్ ధర ఉండగా, 200 యూనిట్లు దాటితే ఒక్కో యూనిట్‌కు ఏకంగా రూ. 5.10 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. కాగా ఈ లెక్కన 200 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ వాడిన గృహజ్యోతి లబ్ధిదారులు ఈ పథకానికి దూరం అవటంతో పాటు నెలకు రూ. వెయ్యి కంటే ఎక్కువగా విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు.

200 యూనిట్లు దాటితే వర్తించదు

నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వాడిన వారికి మాత్రమే గృహజ్యోతి పథకం వర్తిస్తోంది. అంతకు మించి వాడితే వర్తించదు. ఎండల తీవ్రత కారణంగా విద్యుత్ వాడకం పెరిగి ఈ పథకానికి నెల నెల లబ్ధిదారుల సంఖ్య తగ్గుతుంది.

– శంకర్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ, మెదక్



అంగన్‌వాడీల టీచర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టర్: విద్యాపరంగా జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఎంఈఓలు, హెచ్‌ఎంలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా విద్యా ప్రమాణాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో పటిష్ట చర్యలు చేపడుతుందని తెలిపారు. అందుకనుగుణంగా విద్యాధికారులు పనిచేయాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంపై అభినందించారు. ఇదే స్ఫూర్తితో బడిబాటను విజయవంతం చేయాలన్నారు. 15 ఏళ్లు నిండిన నిరక్షరాస్యులైన విద్యార్థులను గుర్తించి వారిని 'ఉల్లాస్' ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ తప్పనిసరిగా జూనియర్ కళాశాలలో నమోదు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూసే బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, డీఈఓ రాధాకిషన్, మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రామేశ్వరప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సత్వరమే పరిష్కరించండి

నర్సాపూర్/చిలప్‌చెడ్(నర్సాపూర్): రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని చండూర్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలప్‌చెడ్ మండలంలోని పది గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని తెలిపారు. రైతుల నుంచి ఇప్పటివరకు సుమారు 357 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. విచారణ ప్రక్రియ వేగవంతం చేసి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నర్సాపూర్ అర్బన్ పార్కులో చేపట్టిన కాటేజీల నిర్మాణ పనులను డీఎఫ్‌ఓ జోజితో కలిసి పరిశీలించారు. మరో 20 రోజుల్లో కాటేజీలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఆయన వెంట ప్రాజెక్టు మేనేజర్ జగన్మోహన్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు ఉన్నారు.

2.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు: ఆర్డీఓ

తూప్రాన్: డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో 2.50 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు జరిగాయని ఆర్డీఓ జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం తూప్రాన్‌లో ఓ రైస్‌మిల్లును పరిశీలించి ధాన్యం సేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మనోహరాబాద్ మండలంలోని పోతారంలో వరి కోతలు ఇంకా మొదలుకాలేదని చెప్పారు. చేగుంట మండలంలో అత్యధికంగా సుమారు లక్ష క్వింటాళ్ల ధాన్యం సేకరించామన్నారు. వెల్దుర్తి మండలంలో 65 వేల క్వింటాళ్లు, నార్సింగిలో 44,267, మాసాయిపేటలో 16,351, తూప్రాన్‌లో 17,112 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు వివరించారు. డివిజన్‌లోని రెవెన్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ వడ్ల కొనుగోలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు డబ్బులు జమ అయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నట్లు తెలిపారు.



తూప్రాన్‌లోని ఓ రైస్‌మిల్లును పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

రవిరాజు.. బోధనలో రారాజు

- యూట్యూబ్ ఛానల్ ద్వారా గుర్తింపు
- ప్రపంచ స్థాయిలో ప్రశంసలు



వినూత్న రీతిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు రవిరాజు

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, మధ్య తరగతి విద్యార్థులకు వినూత్న రీతిలో నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించాడు మండలంలోని ఆద్మాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రవిరాజు. అనుకున్నదే తడువుగా ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తూ ఆకట్టుకున్నాడు. దానిని తన యూట్యూబ్ ఛానల్ ద్వారా తెరపైకి ఎక్కించి ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల్లో చేరుస్తున్నాడు. ప్రపంచస్థాయిలో అతని విద్యా విధానం చాలా మందికి నచ్చింది. యూట్యూబ్ ఛానల్‌కు ప్రశంసలు వచ్చాయి. కేంద్ర విద్యాశాఖ అధికారులు రవిరాజు ఏ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడో గుర్తించాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ అధికారులు రవిరాజును సచివాలయానికి రావాల్సిందిగా సూచించారు. విద్యాశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నరసింహారెడ్డి ఇతర అధికారులు సన్మానించి ప్రశంసించారు.

నూతన భవనం.. సకల వసతులు

అనంతరం మీరు పనిచేస్తున్న పాఠశాలకు ఏమి కావాలని రాష్ట్ర అధికారులు ఉపాధ్యాయుడు రవిరాజును అడిగారు. నూతన భవనం, మరికొన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. దీంతో వెంటనే కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫోన్ చేసి రవిరాజు పనిచేస్తున్న ఆద్మాపూర్ ప్రాథమిక పాఠశాలకు కావాల్సిన వసతులు కల్పించాలని, భవన నిర్మాణానికి కావాల్సిన అంచనా వివరాలను పంపించాలని ఆదేశించారు. ఇటీవల కలెక్టర్ రాహుల్‌రాజ్ స్వయంగా పాఠశాలకు వచ్చి పరిశీలించి రవిరాజును అభినందించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివించాలన్నదే తన లక్ష్యమన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు తెలియకుండానే చదువుపై ఆసక్తి పెరిగేలా వినూత్న రీతిలో నాణ్యమైన విద్యా బోధనను ప్రారంభించానని చెప్పాడు. విద్యార్థులకు బోధించే తీరుపై యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రపంచస్థాయిలో ప్రశంసలు రావడం ఆనందంగా ఉందని అన్నారు.

సీహెచ్‌సీలో ప్రసవానికి నిరాకరణ

- వైద్య అధికారుల నిర్లక్ష్యం
- గాంధీకి తరలించాలంటూ ఉచిత సలహా



108లో మగబిడ్డకు జన్మనిచ్చిన కృప

తూప్రాన్: ప్రసవం చేయడం తమవల్ల కాదని వైద్యులు చేతులెత్తేశారు. పైగా గర్భిణిని గాంధీకి తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ఆమె ప్రసవించింది. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పోతరాజుపల్లికి చెందిన కృప రెండవ కాన్పు కోసం పట్టణంలోని సీహెచ్‌సీకి భర్త క్రాంతి కుమార్ శుక్రవారం తీసుకొచ్చారు. వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి కాన్పు కావడం కష్టం అవుతుందన్నారు. ఆస్పత్రిలో వైద్యులు, పరికరాలు లేవని తేల్చి చెప్పారు. వెంటనే గాంధీకి తీసుకెళ్లాలని సూచించారు. అసలే పేదవారు కావడంతో గాంధీకి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. తీరా 108లో తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ శ్రీనివాస్ అంబులెన్స్‌లోనే కాన్పు చేశాడు. పండంటి మగ బిడ్డకు కృప జన్మనించింది. అనంతరం గాంధీ ఆస్పత్రిలో చేర్చగా తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. కాగా ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందుతుందని వస్తే వైద్యులు లేరని తిప్పి పంపడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నత చదువులకు 'దూరం'

తూప్రాన్‌లో కలగా మిగిలిన డిగ్రీ కళాశాల



తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

తూప్రాన్: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు కలగానే మారాయి. డివిజన్ కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుచేయాలని ఏళ్లుగా ఇక్కడి ప్రజలు కోరుతున్నా ఆ దిశగా అడుగు పడడం లేదు. పై చదువుల కోసం విద్యార్థులు మేడ్చల్, గజ్వేల్, రంగారెడ్డి జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల్లో చేరేందుకు తరలివెళ్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు మాత్రం ఫీజులు చెల్లించలేక చదువులకు స్వస్తి చెబుతున్నారు. అమ్మాయిలు ఇంటి వద్దే ఉంటుండగా.. మగ పిల్లలు పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా చేరుతున్నారు. మరికొందరు జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసలుగా మారి ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే డివిజన్ చుట్టుపక్కల మండలాలైన శివ్వంపేట, వెల్దుర్తి, చేగుంట, దౌల్తాబాద్, వర్గల్, మనోహరాబాద్ మండలాలకు చెందిన విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.

స్థలం కేటాయించినా..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు అప్పట్లో రెవెన్యూ అధికారులు సివిల్ సప్లై గోడౌన్ల సమీపంలో ప్రభుత్వ స్థలం గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. కానీ విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. దీంతో డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలిపోయింది.

అందరికీ అనుకూలం



ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ప్రభుత్వం స్పందించి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ఇంటర్‌తో పాటు డిగ్రీలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ప్రభావతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు



డిగ్రీ కళాశాల లేక అనేక మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆపేస్తున్నారు. కళాశాల ఏర్పాటు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కలెక్టరేట్ సైతం ముట్టడించాం. అయినా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి.

– అజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు

క్లుప్తంగా

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేట కమాన్: యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీపీ అనురాధ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. తాత్కాలిక ఆనందం కోసం కుటుంబాలను దూరం చేసుకోవద్దన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలన్నారు. మత్తు పదార్థాల గురించి ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా పోలీసు కంట్రోల్ రూమ్ 87126 67100కు సమాచారం తెలపాలని సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర గౌడ్ కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి ఇసుక బావి వద్ద శుక్రవారం ఓ బహిరంగ ప్రదేశంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందింది. పటాన్‌చెరు ఎక్సైజ్ అధికారులు వెళ్లి చూడగా రామచంద్రపురానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ వేరే వ్యక్తికి గంజాయి విక్రయిస్తున్నాడు. వెంటనే అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 260 గ్రాముల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు.

మూడు చోట్ల 3.315 కిలోలు స్వాధీనం

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు చోట్ల 3.315 కేజీల గంజాయి పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం అధికారులు వెల్లడించారు. ఎస్ఆర్ నగర్‌కు చెందిన సందీప్ వద్ద నిల్వ ఉన్న 1.500 కేజీల గంజాయి, స్కూటీ, సెల్ ఫోన్, బీరంకొండకు చెందిన సాయికుమార్, శ్రీకాంత్ వద్ద నిల్వ ఉన్న 1.200 కేజీల గంజాయి, బైక్, రెండు సెల్ ఫోన్‌లు పట్టుకున్నామన్నారు. అలాగే మరో వ్యక్తి వద్ద 615 గ్రాముల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి సంగారెడ్డి పోలీసులకు గంజాయితోపాటు అప్పగించామన్నారు. దాడుల్లో సీఐలు వీణారెడ్డి, బీ.గాంధీ, ఎస్ఐలు అనిల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో చెరువులో దూకి ఆత్మహత్య

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మహమ్మద్‌నగర్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య తన చిన్నకూతురు బాలమణిని కౌడిపల్లికి చెందిన చాకలి శేఖర్(40)కి ఇచ్చి వివాహం చేసి ఇల్లరికం అల్లుడిగా తెచ్చుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. గతేడాది కాలంగా శేఖర్ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా తిరుగుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి శేఖర్ మద్యం సేవించి రావడంతో మళ్లీ గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న అతడు కన్నారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు

జిన్నారం (పటాన్‌చెరు): ఓ ప్రైవేట్ క్లినిక్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేసిన ఘటన మండలంలోని వావిలాల గ్రామంలో చోటుచేసుకుంది. అధికారుల కథనం మేరకు.. విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాము ఆధ్వర్యంలో శుక్రవారం జిన్నారం మండలం వావిలాల గ్రామంలోని ఓ క్లినిక్ పై దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా గడువు ముగిసిన 25 రకాల మందులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.10 వేల వరకు ఉంటుంది. ఎలాంటి అర్హత లేకుండా క్లినిక్ ను నిర్వాహకుడు సత్యనారాయణ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిన్నారం, బొల్లారం కంట్రోల్ ఇన్ స్పెక్టర్లు శ్రీకాంత్, ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సరదా సరదాగా..

- పర్యాటక ప్రాంతంగా సిద్దిపేటలోని కోమటిచెరువు
- సెలవుల్లో విద్యార్థులు వెళ్లడానికి చూడ ముచ్చటైన ప్రాంతం
- తీగల వంతెన, పార్కులు, నెక్లెస్ రోడ్డు ఎంతో ప్రత్యేకత
- కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ప్రసిద్ధి

ఆహ్లాదంతో పాటు ఆధ్యాత్మికతకు అడ్రస్ సిద్దిపేట. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ప్రసిద్ధి చెందిన ఆలయాలు.. అందమైన కోమటి చెరువు కనువిందు చేస్తున్నాయి. శని, ఆది వారాల్లో కోమటి చెరువుకు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వస్తుంటారు. వేసవి సెలవుల్లో పర్యటించేందుకు ఇదో చూడచక్కని ప్రదేశంగా చెప్పవచ్చు.


–సాక్షి, సిద్దిపేట



కొమురవెల్లి దేవాలయం

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం. సిద్దిపేట పాత బస్టాండ్ నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ మల్లన్న పట్నం, బోనాలు చేయడం ప్రసిద్ధి. అనంతరం స్వామికి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. అలాగే సిద్దిపేట పట్టణంలో కోటి లింగాల దేవాలయం, వెంకటేశ్వర స్వామి దేవాలయం సైతం సందర్శించొచ్చు.

బోటింగ్..



చెరువులో బోటింగ్‌ను సైతం అందుబాటులో ఉంచారు. స్పీడ్ బోట్, సాధారణ బోట్‌లు ఉన్నాయి. స్పీడ్ బోట్‌లో నలుగురు ప్రయాణించే విధంగా, సాధారణ బోట్ 20 నుంచి 30 మంది వరకు ప్రయాణించవచ్చు. స్పీడ్ బోట్ అయితే నలుగురికి కలిపి రూ.350, అదే సాధారణ బోట్ అయితే ఒక్కరికి రూ.50 వసూలు చేస్తున్నారు.

వాటర్ షో..

చెరువులో వాటర్ షోను ఏర్పాటు చేశారు. ప్రతీ రోజు రాత్రి 7, 8 గంటలకు ఇలా రెండు వాటర్ షోలు జరుగనున్నాయి. పాటలతో జలదృశ్యం ఆవిష్కృతం అవుతుంది. కలర్ కలర్ లైట్‌లతో వాటర్ డ్యాన్స్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఈ షోను కూర్చుని వీక్షించే విధంగా ఏర్పాటు చేశారు.

జిగేల్... జిగేల్ నెక్లెస్ రోడ్

కోమటి చెరువు పై ఏర్పాటు చేసిన రూబీ నెక్లెస్ రోడ్డు పట్టణానికి మణిహారంగా నిలుస్తోంది. పచ్చదనం.. జిగేల్.. జిగేల్‌మనే విద్యుత్ కాంతులు ఎంతగానే ఆకర్షిస్తున్నాయి. వాకింగ్, సైక్లింగ్‌కు అనువుగా ఉండేందుకు సింథటిక్ ట్రాక్‌ను నిర్మించారు. రాత్రి సమయంలో ఒక వైపు విద్యుత్ కాంతులు.. మరో వైపు మానసిక ప్రశాంతత కోసం మ్యూజిక్‌ను ఏర్పాటు చేశారు. రూబీ నెక్లెస్ రోడ్ షూటింగ్ స్పాట్‌గా నిలుస్తోంది. ప్రీ వెడ్డింగ్, ప్రైవేట్ సాంగ్స్ చిత్రీకరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్నారు.

గ్లో గార్డెన్

కోమటి చెరువు సమీపంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన గ్లో గార్డెన్ మిరుమిట్లు గొలిపే అందాలతో ఆకర్షిస్తోంది. దేశంలోనే మొట్ట మొదట గుజరాత్‌లోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ విగ్రహం వద్ద ఈ గ్లో గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం సిద్దిపేటలోనే ఏర్పాటు చేయడం విశేషం. మెరిసే జంతువు, పక్షులు, చెట్ల బొమ్మలు ప్రజలను ఎంతో ఆకర్షిస్తున్నాయి. ఫాగ్ పాయింట్‌లోకి వెళ్తే మంచు కురిసే ప్రాంతానికి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. డ్యాన్సింగ్ ఫ్లోర్‌లో చిన్నారులు డ్యాన్స్‌లు వేస్తుంటారు.

డైనో పార్క్..

కోమటి చెరువుకు పక్కనే 1.5 ఎకరాల విస్తీర్ణంలో డైనో పార్క్‌ను ఏర్పాటు చేశారు. డైనో పార్క్ అంటే ఏదో ఎగ్జిబిషన్‌లా బొమ్మలు, 3డీ యానిమేషన్ స్క్రీన్‌లు కాదు. అమెరికా, సింగపూర్‌లలోని యూనివర్సల్ వరల్డ్ స్టూడియోలో ఉన్న డైనో పార్క్ తరహాలో సిద్దిపేటలో ఏర్పాటు చేశారు. ఈ పార్క్‌ను కొండలు, గుహాల మాదిరిగా నిర్మించారు. గుహాలో ఓపెన్ ట్రెన్‌ను ఏర్పాటు చేశారు. ట్రెన్‌లో వెళ్తుంటే డైనోసార్‌ల అరుపులు, మీదకు వచ్చిన అనుభూతి కలుగుతుంది. ఒక్కసారిగా డైనోసార్‌లు మీదపడినట్లు, భీకరంగా అరవడం లాంటివి సౌండ్‌లు ఏర్పాటు చేశారు. దీనికి ఒక్కరికి రూ.50లు టికెట్ వసూలు చేస్తున్నారు.



కోమటి చెరువు

సిద్దిపేట పట్టణంలో కోమటి చెరువు కోటి అందాలతో పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో కోమటి చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దారు. సిద్దిపేట పాత బస్టాండ్ నుంచి 2 కిలోమీటర్ల దూరంలో పర్యాటక ప్రాంతమైన కోమటి చెరువు ఉంది. చెరువు వద్ద మున్సిపాలిటీ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చేశారు. ఈ చెరువుపై నిర్మించిన తీగల వంతెన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సుమారుగా 200 మీటర్ల దూరం ఉంటుంది. చెరువు మధ్యలో ఉన్నట్టుగా ఉంటుంది. దీనిపై ఒకేసారి 200 మంది నడిచే విధంగా తీర్చిదిద్దారు. వంతెనకు కలర్ లైట్‌లు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో విద్యుత్ కాంతులతో ఆకర్శిస్తోంది. దీని రుసుము రూ.10 వసూలు చేస్తున్నారు.

స్కై సైక్లింగ్..

మీరు సాహస యాత్రలు చేయాలనుకుంటే అద్భుతమైన యాక్టివిటీ కోమటి చెరువులో ఉంది. ఇక్కడ స్కై సైక్లింగ్‌ను ఏర్పాటు చేశారు. గాలిలో రోప్ సాయంతో సైకిల్ చేసే విన్యాసం చూపరులను గగుర్పాటుకు గురి చేస్తుంది. ఇది ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఒక్కరికి రూ.50 రుసుం వసూలు చేస్తున్నారు.

శుభకార్యానికి వస్తూ..

- టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి..
- అక్కడికక్కడే వృద్ధుడు మృతి



పోచయ్య(ఫైల్)

వర్గల్(గజ్వేల్): బంధువుల ఇంట్లో శుభకార్యానికి వస్తూ టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి కింద పడిపోయి వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం వర్గల్ మండలం మాదారం–గిర్మాపూర్ గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మెదక్ జిల్లా దొంతి గ్రామానికి చెందిన దేవోల్ల పోచయ్య(70) టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనంపై వర్గల్ మండలం గిర్మాపూర్‌లో బంధువుల ఇంట్లో వివాహ వేడుకకు వస్తున్నాడు. మాదారం–గిర్మాపూర్ మధ్య మలుపులో వాహనం అదుపుతప్పి పడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై ఉద్యోగి ..

బెజ్జంకి(సిద్దిపేట) : మద్యానికి బానిసై ఉద్యోగి మృతి చెందిన ఘటన బెజ్జంకిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం కేంద్రానికి చెందిన న్యాత మల్లేశం(50) అక్కడే ఎంఆర్‌ఓ కార్యాలయంలో రికార్డు అసిసెంట్‌గా పని చేస్తున్నాడు. కుటుంబంతో కలిసి బెజ్జంకిలో నివసిస్తున్నాడు. మల్లేశం కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి మద్యం తాగి బైక్‌పై ఇంటికొచ్చాడు. లోపలికి వస్తూనే మత్తులో కిందపడి అస్వస్థతకు గురయ్యాడు. కొద్దిసేపటికి వాంతులు, విరోచనాలు చేసుకున్నాడు. చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

పశుగ్రాసం వృథాకు చెక్

హార్వెస్టర్‌తో వరి కోతలు

- అనంతరం గడ్డిని కట్టలు కట్టే బేలర్ యంత్రం
- కట్టకు రూ.30 నుంచి 35 వసూలు

దుబ్బాకటౌన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా రైతు సైతం యంత్రాలపై ఎక్కువగా ఆధార పడుతున్నాడు. హార్వెస్టర్‌తో కోసిన వరి పొలాల్లో గడ్డి తక్కువగా రావడంతో పాటు పొలంలో పడి వృథా అవుతుంది. దీంతో రైతులు ఆ గడ్డిని కాల్చేస్తున్నారు. డైరీ ఫామ్ నిర్వాహకులకు, పాల వ్యాపారంపై ఆధార పడుతున్న రైతులకు పశుగ్రాసం కొరత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పలువురు రైతులు బేలర్ యంత్రాలతో గడ్డిని కట్టలు కట్టి తెచ్చుకుంటున్నారు. గడ్డిని అమ్ముతూ పశుగ్రాసం కొరత తీర్చుకుంటున్నారు.

ఒక్కో కట్టకు రూ.30 నుంచి 35

వరి గడ్డి కట్టే బేలర్ యంత్రాలు ట్రాక్టర్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. హార్వెస్టర్ కోసినప్పుడు పొలమంతా పడిన గడ్డిని బేలర్ యంత్రం కట్టలు కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే 40 నుంచి 50 కట్టలు కడుతుంది. ఒక్కో కట్టకు రూ.30 నుంచి 35 తీసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో గేదెలను పెంచే రైతులు పొలంలోని గడ్డిని తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముందుగా రైతులకు ఎంతో కొంత డబ్బు చెల్లించి యంత్రంతో కట్టలు కట్టిస్తున్నారు.



గడ్డిని కట్టలు కడుతున్న బేలర్ యంత్రం

కాల్చడానికి వెనుకడుగు

గడ్డికి సైతం డబ్బులు వస్తుండటంతో రైతులు గడ్డిని కాల్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. వానాకాలం సీజన్ వరి పంట కోసేంత వరకు ఎండు గడ్డి దొరకని పరిస్థితి ఇక ఉండదు. కాబట్టి పశుగ్రాసాన్ని 3, 4 నెలలు వచ్చేలా పాడి రైతులు నిల్వ చేస్తుంటారు. ప్రస్తుతం వేసవి కావడంతో మేత లెక్కన ఒక్కో పాడి పశువు ఒక కట్ట మేస్తుంది. ఎకరానికి రూ. 2 నుంచి రూ.3 వేల వరకు గడ్డి కోసం ఖర్చు చేస్తున్నారు. దీంతో గడ్డికి డిమాండ్ ఏర్పడుతుంది.

కట్టలు నిల్వ చేసుకుంటున్నా



నాకు రెండు పాలిచ్చే గేదెలు ఉన్నాయి. మళ్లీ 3 నుంచి 4 నెలల వరకు గడ్డి దొరకదు. ప్రస్తుతం హార్వెస్టర్ కోసిన గడ్డిని కట్టలు కట్టించి నిల్వ చేసుకుంటున్నా. కట్టలు కట్టినందుకు 150 కట్టలకు సుమారు రూ.4,500 వరకు ఖర్చు వచ్చింది.

– భాస్కర్ రెడ్డి రైతు, దుబ్బాక

కూలీల ఖర్చు తగ్గింది



బేలర్ యంత్రాలు రాకముందు గడ్డి వాము పెట్టాలంటే రోజుకు ఒక్క కూలీకి రూ.600 నుంచి రూ.700 వరకు చెల్లించే వాళ్లం. బేలర్ యంత్రాలతో కట్టలు కట్టించడం వల్ల కూలీల ఖర్చు మిగలడమే కాకుండా సమయం వృథా కావడం లేదు.

– రాజిరెడ్డి రైతు, దుబ్బాక

పోలీసులకే చుక్కలు చూపించాడు

- ఆరు నెలలుగా అనవసరంగా 77 సార్లు డయల్ 100కి కాల్
- విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం పెద్ద ముబారక్‌పూర్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ డీ.వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. పెద్దముబారక్‌పూర్ గ్రామానికి చెందిన నాయకిని సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. రోజుకో పేరు, ఊరు పేరు మార్చుకుంటూ సాయంత్రం కాగానే డయల్ 100కు కాల్ చేయడం మొదలు పెట్టాడు. భార్య తప్పిపోయింది.. పెట్రోల్ పోసుకుంటున్నా.. మందు తాగి చనిపోతున్నా.. అంటూ రోజుకో మాట చెబుతూ డయల్ 100కు కాల్ చేశాడు. పోలీసులు వెళ్తే ఎవరూ ఉండేది కాదు. ఆరు నెలలుగా రోజూ పోలీసులకు చుక్కలు చూపించాడు. విసిగిపోయిన పోలీసులు డయల్ 100కు ఎవరూ కాల్ చేస్తున్నారనే కోణంలో విచారణ చేపట్టారు. సంబంధిత వ్యక్తి ఎవరని గుర్తించారు. ఎట్టకేలకు సురేశ్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎవరైనా డయల్ 100కు అనవసరంగా కాల్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు.

కవిత్వానికి సమాజమే పునాది



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్, దేశపతి శ్రీనివాస్, నందిని సిదారెడ్డి, తదితరులు

కవి వేణుగోపాల్

సిద్దిపేటకమాన్: కవిత్వానికి సమాజమే పునాది అని కవి వేణుగోపాల్ అని అన్నారు. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవి కిషన్ కవిత్వం పుస్తకాలు పేగు తెగిన పాట, వడిసెల ఆవిష్కరణ సభ నిర్వహించారు. మరసం అధ్యక్షుడు రంగాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కవి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కవిత్వానికి సామాజిక నేపథ్యమే పునాదిగా రచనలు చేస్తే ఆ రచన సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. వ్యక్తిగతమైన సాహిత్యం ఎక్కువ కాలం నిలబడేది కాదన్నారు. కవిత్వం మనిషిని మరింత ఉన్నతీకరించడానికి, సమాజంలో మానవ సంబంధాలను పెంపొందించడానికి ఉపయోగపడాలని అన్నారు. కార్యక్రమంలో యాదగిరి, అశోక్, నందిని సిదారెడ్డి, దేశపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతమైన అభివృద్ధికి ప్రణాళిక



మాట్లాడుతున్న వీసీ రాజిరెడ్డి

- ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రాజిరెడ్డి
- పలు సంస్థలతో ప్రత్యేక సమావేశం

ములుగు(గజ్వేల్) : రాష్ట్రంలో ఉద్యాన సాగు చేసిన రైతులు స్థిరమైన, వేగవంతమైన అభివృద్ధి సాధించేందుకు బృహత్ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యానవర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగు ఉద్యానవర్సిటీ వేదికగా రైతులు, ఉత్పత్తిదారుల సంస్థలు, పరిశ్రమ ప్రతినిధులు, ఆదర్శరైతులు, ఎఫ్‌పీఓ నాయకులు, వ్యవసాయ, వ్యాపార సంస్థలు, ఎగుమతిదారులు, ఇన్‌పుట్ సరఫరాదారులు, పరిశోధన నిపుణులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు పరిశ్రమ భాగస్వామ్యాలు, ఆవిష్కరణ, ఆధారిత సాగు, వాతావరణ స్థితిస్థాపక పంట ప్రణాళికను సులభతరం చేయడంలో విశ్వవిద్యాలయం నిబద్ధతను కొనియాడారు. మార్కెట్ పోకడలు, పంట వైవిధ్యీకరణ వ్యూహాలు, ఎఫ్‌పీఓల ద్వారా సామర్థ్య నిర్మాణం, ఖచ్చితమైన వ్యవసాయం కోసం సాంకేతిక ఏకీకరణ, పంటల తర్వాత నిర్వహణ ఎగుమతి, ప్రాసెసింగ్ పరిష్కారాలు అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు భగవాన్, చీనా నాయక్, లక్ష్మీ నారాయణ, సురేశ్ కుమార్, రాజశేఖర్, వీణాజోషి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

వెల్దుర్తి(తూప్రాన్): హకింపేట హల్దీ ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. వెల్దుర్తి మండలం చెర్లపల్లి పంచాయతీ పరిధి వర్దవాని చెరువు తండాకు చెందిన గోపాల్(34) చేపలు పట్టే క్రమంలో గురువారం నీటమునిగి గల్లంతయ్యాడు. శుక్రవారం ఉదయం ప్రాజెక్ట్‌లో మృతదేహం నీటిపై తేలడంతో బయటకి తీశారు. మృతుడికి భార్య చికిలి, కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోస్త్‌ను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తదితరులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

సిద్దిపేట ఎడ్యుకేషన్: డిగ్రీలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులకు దోస్త్ అడ్మిషన్ ప్రక్రియ తోడ్పాడుతుందని, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు. శుక్రవారం కళాశాలలో దోస్త్ అడ్మిషన్‌ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాల 1956 లో ప్రారంభమై ఎంతోమంది విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దిందన్నారు. కళాశాల, న్యాక్ ఏ+గ్రేడ్ కలిగి ఉండి, ఐఎస్‌ఓ గుర్తింపు పొంది స్వయం ప్రతిపత్తి కలిగిన ఏకైక కళాశాల అన్నారు. అన్ని వసతులతో కూడిన ల్యాబ్స్, పీహెచ్‌డీ, నెట్, సెట్‌లు పూర్తి చేసిన అనుభవం గల అధ్యాపకులతో విద్యా బోధన ఉంటుందని దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా కళాశాలను ఎంచుకోవాలన్నారు. అడ్మిషన్ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కళాశాలలోని దోస్త్ జిల్లా సహాయ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్య రెడ్డి, డాక్టర్ గోపాల సుదర్శనం, దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీధర్, మధుసూదన్ రెడ్డి, గురుమూర్తి, దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ మహేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రం.. కళల నిలయం

విద్యార్థులకు ఉచిత వేసవి శిబిరాలు

- జహీరాబాద్ శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ
- పెయింటింగ్, డ్రాయింగ్, మట్టితో బొమ్మల తయారీ వంటి వాటిల్లో తర్ఫీదు



పిచరాగడి గ్రామంలోని శిబిరంలో పిల్లలు

జహీరాబాద్ టౌన్: వేసవి సెలవులు పిల్లలకు ఆనందాన్ని పంచే అద్భుత క్షణాలు. ఈ సెలవులను ఆడుతూ.. పాడుతూ సద్వినియోగం చేసుకునేలా జహీరాబాద్ శ్రామిక విజ్ఞాన కేంద్రం, మన లైబ్రరీ నిర్వాహకులు కృషి చేస్తున్నారు. కొన్నేళ్ల నుంచి వేసవి సెలవుల్లో ఉచితంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తూ పలు అంశాల్లో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసి వృద్ధి చేసుకునేందుకు కృషి చేస్తున్నారు. ఏప్రిల్ నెల చివరి వారంలో ప్రారంభమైన శిక్షణ శిబిరాలు మే మూడో వారం వరకు కొనసాగనున్నాయి.

శిక్షణలో ముఖ్యమైనవి

యూకేజీ నుంచి టెన్త్‌ల కోసం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇందులో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, గణిత నైపుణ్యం, పెయింటింగ్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైయిటింగ్, మట్టితో బొమ్మల తయారీ, ఫిజిల్స్ పరిష్కారం, పేపర్‌తో కళాకృతులు తయారీ తదితర అంశాలపై నిపుణులు నేర్పిస్తున్నారు.

పెరిగిన శిక్షణ కేంద్రాలు

వేసవి శిక్షణ శిబిరం కొన్నేళ్ల కిందట పట్టణంలో మాత్రమే నిర్వహించే వారు. గ్రామీణ ప్రాంత పిల్లల పట్టణానికి రాలేకపోతున్నారని. ఈ సారి గ్రామల్లో కూడా శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పట్టణంలోని హౌసింగ్ బోర్డులో 3, ఎన్‌జీవోస్ కాలనీ, మాణిక్ ప్రభు వీధి, నాగన్‌పల్లి, అల్గోల్, కుప్పానగర్, బర్దిపూర్, రంజోల్, పిప్పడ్‌పల్లిలో ఒకటి చొప్పున పస్తాపూర్‌లో రెండు శిబిరాలు నడుస్తున్నాయి. వేసవి శిబిరాలకు మంచి స్పందన వస్తుంది. ప్రతీ సెంటర్ పదుల సంఖ్యలో పిల్లలు వస్తుండగా శిక్షకులు వారికి పలు విషయాలను ఆడుతూ పాడుతూ నేర్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

వేసవిలో పిల్లలు సెల్‌ఫోన్‌కే పరిమితం కావడం, ఎండల్లో తిరగడం వంటివి చేస్తుంటారు. విద్యతో పాటు కళలు కూడా జీవితంలో ఎంతో ముఖ్యమైనవి, కాబట్టి కొన్నేళ్లుగా ఉచితంగా వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాం. ప్రతీ సంవత్సరం నిర్వహించే శిబిరాలకు మంచి స్పందన వస్తుంది. ఈ సారి శిక్షణ కేంద్రాలను కూడా పెంచాం. తల్లిదండ్రులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్, శివబాబు,
శ్రామిక విజ్ఞాన వేదిక కార్యదర్శి, జహీరాబాద్